టెర్మినల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభమై 5 నెలలు గడిచింది. ఇప్పటికీ అక్కడ కనీస మౌలిక వసతులు లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ప్రభుత్వం స్పందించిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ క్రమంలో ఆయన సోమవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించారు.

అత్యంత ప్రాధాన్యత కింద రోడ్ల నిర్మాణాలు..

రూ.120 కోట్లతో టెర్మినల్‌కు లింకు రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. రైల్వేస్టేషన్ నుంచి హెచ్‌సీఎల్ జంక్షన్, రైల్వేస్టేషన్ నుంచి రాంపల్లి మీదుగా ఘట్‌కేసర్, చెంగిచర్ల మీదుగా వరంగల్ హైవే వరకు, చక్రిపురం నుంచి ఈసీనగర్ గణేష్ కమాన్ వరకు, రైల్వేస్టేషన్ ప్రధానమార్గం, మల్లాపూర్ నుంచి నోమా జంక్షన్ వరకు రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనితో పాటు చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఎస్టేట్, పరిసర కాలనీల ప్రజలకు తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు కార్యాచరణ చేపట్టామన్నారు. ఆయిల్ కంపెనీలకు సంబంధించిన భారీ ట్యాంకర్లు పార్కింగ్‌తో పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా వారికి ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, గిరిబాబు, ప్రబాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి రైల్వే టెర్మినల్ వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉద్యమకారులకు సంఘీభావం..

కుషాయిగూడ: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపారు. సోమవారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఉద్యమకారులు చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. 250 గజాల ఇంటిస్థలం, రూ.25 వేల పెన్షన్, గుర్తింపుకార్డు, ప్రభుత్వ పథకాల్లో 20 శాతం కోటాను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, నల్లా రాధాకృష్ణ, నేమూరి మహేష్‌గౌడ్, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు తాడూరి గగన్‌కుమార్, రహీం, దయానంద్, జానకిరెడ్డి, అనంతలక్ష్మి, జగన్‌యాదవ్, జంగాసుదర్శన్, కిరణ్‌కుమార్, భానుప్రకాష్, శివకుమార్, రాంచందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరం వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ద్వారకానగర్ ఫేస్ 1,2, అంజనేయనగర్, కేశవనగర్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్కాజిగిరి: ఉత్తమ్‌నగర్ సబ్‌స్టేషన్ 11కేవీ ఐఎస్‌నగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, 11కేవీ ఉత్తమ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కళ్యాణ్ తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ కాచవానిసింగారం ఫీడర్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ ప్రతాప్‌సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ నిలిపేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

- 11కేవీ కాచవానిసింగారం ఫీడర్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా 33/11కేవీ ప్రతాప్ సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. అల్వాల్ సబ్‌స్టేషన్ 11కేవీ హెచ్‌ఎంటీ ఆఫీసర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మచ్చ బొల్లారం సబ్‌స్టేషన్ 11కేవీ సాయిరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించండి

మౌలాలి : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి లో ప్రెషర్, డ్రైనేజీ సమస్యలు తరుచూ ఉత్పన్నం అవుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని పలువురు బీఆర్‌ఎస్ నేతలు కోరారు. ఈ మేరకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు జలమండలి జీఎం సునీల్, డీజీఎం అర్పిత, ఏఈ నవీన్‌లను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ బస్తీ, నానాహిల్స్ తదితర ప్రాంతాలు ఎగువ ప్రాంతాల్లో ఉండటంతో తాగునీరు సరిగ్గా రావడంలేదని, లో ప్రెషర్ సమస్యను పరిష్కరించేందుకు బూస్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యలను పరిష్కరించాలని కోరగా.. జలమండలి అధికారులు సానుకూలంగా స్పందించారు. కాలనీవాసులు ఇబ్రహిం, అఫ్రోజ్, జియా, అతీక్, బీఆర్‌ఎస్ నేతలు వంశీముదిరాజ్, ఉస్మాన్, స్వామి, మారుతీప్రసాద్, బాలస్వామి పాల్గొన్నారు.


జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అభివృద్ధి పనులకు రూ.34.95 కోట్లు !


మంత్రి శ్రీధర్‌బాబుతో తోటకూర జంగ్‌యాదవ్

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సోమవారం బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సుమన్‌నాయక్ కలిసి అభినందించారు. బోడుప్పల్‌లో ప్రధాన రహదారులు, చెరువుల సుందరీకరణ, పార్కు అభివృద్ధికి రూ 34.95 కోట్లు నిధులు కేటాయించిన సందర్భంగా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ పనులు ప్రారంభం కాగా.. రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించి, టెండర్ ప్రక్రియలో ఉందన్నారు. ఈ పనులను త్వరలో ప్రారంభించి పనులు పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులను పర్యవేక్షిస్తున్న మాజీ కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ సాయిహిల్స్ కాలనీలో సోమవారం మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆదేశాల మేరకు (యూజీడీ) అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రజల సహకారంతో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాలనీవాసులు మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రవణ్, హరి, రాకేష్‌రెడ్డి, మున్సిపల్ అధికారి లింగస్వామి, నవీన్‌రెడ్డి, కాంట్రాక్టర్ మనోహర్ తదితరులున్నారు.



నూతన కార్యవర్గం ఏకగ్రీవం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ జొన్నబండ వజ్ర ఎన్‌క్లేవ్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రామమోహన్‌రావు, అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా అనురాధ, కార్యదర్శిగా శ్రీధర్, సాధారణ కార్యదర్శిగా సుదర్శనం, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం, సంఘటనా కార్యదర్శిగా సాయిశ్రీధర్, సాంస్కృతిక కార్యదర్శులుగా వరలక్ష్మి, గాయత్రి, ఆశలత సలహాదారులుగా సుందరసాయి, కేశవ్‌కుమార్, సుబ్బారావు, ఏడీరెడ్డి, విజయ్‌కుమార్, వివేకానంద, శ్రీనివాస్‌రెడ్డి, కాళిదాస్, కార్యవర్గసభ్యులుగా సంతోష్, కిరణ్‌కుమార్, కృష్ణవేణి, పాల్గుణరావు, మంగ, స్వప్న, మానస, కేఎస్.రెడ్డిలను ఎన్నుకున్నారు.

ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో 'శాంతి దీక్ష'


ఉద్యమకారులకు సంఘీభావం తెలుపుతున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం అల్వాల్ జేఏసీ ప్రాంగణంలో 'శాంతి దీక్ష' చేపట్టారు. ఈ దీక్షకు కార్పొరేటర్ శాంతి హాజరై ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వారికి ఇళ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలని ఆమె కోరారు. పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, పుట్నాల కృష్ణ, సుధీర్, రవి, సతీష్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి !

కుషాయిగూడ: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు అన్నారు. సోమవారం ఈసీఐఎల్‌లో వాహనదారులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వాహనదారులతో హెల్మెట్లు కొనుగోలు చేయించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మల్లాపూర్: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు వెంకటేష్‌కు రూ. 60వేలు, అశోక్‌రెడ్డికి రూ. 54వేల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, పైళ్ల ప్రవీణ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ సాయంతో మహిళలు రుగ్మతలను తగ్గించుకోవచ్చు


డాక్టర్ అనూష

ఉప్పల్: మహిళలకు వస్తున్న అనేక రుగ్మతులను వైద్యరంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, టెక్నాలజీతో సులభంగా తగ్గించుకోవచ్చని ప్రముఖ రేడియాలజిస్టు డా. అనూష బింగి సూచించారు. అపరిశుభ్రత అవగాహన లేమి కారణంగా మహిళలు తరచూ అనారోగ్యం భారిన పడుతుంటారన్నారు. అటువంటి సందర్భంలో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకుని డాక్టర్లను సంప్రదించాలన్నారు. వ్యాధి రాకముందే జాగ్రత్త వహించాలని, సరైన పౌష్టికాహారం, వ్యాయామం, యోగాతో రోగాలకు దూరంగా ఉండొచ్చని సూచించారు. దీనికోసం మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ప్రగతి చక్ర అవార్డుల ప్రదానం

బోడుప్పల్: ఆర్టీసీ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని ఆర్టీసీ సికింద్రాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ జీఎస్ పవిత్ర అన్నారు. సోమవారం చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో జరిగిన ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు విశిష్ట సేవలు అందించడంతో పాటు అధిక ఆదాయాన్ని సమకూర్చడంలో నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. చెంగిచర్ల డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వైవీ. శేషిరెడ్డిని ఘనంగా సత్కరించారు. చెంగిచర్ల డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు చంద్రమౌళి, సాయి సుబ్రహ్మణ్యం, అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ సత్యానగర్‌లో నివాసం ఉండే సంపత్ నాగోల్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనం (టీజీ34ఏ 6210) పై సోదరుడితో కలిసి ఆఫీస్‌కు వెళ్తున్నాడు. కాగా శాంతినగర్‌లోని భగాయత్‌లోకి వస్తున్న సమయంలో ఎన్‌జీఐటీ కళాశాల బస్సు (టీఎస్05యూఏ5677) వెనుక నుంచి ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన అతడిని ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

అల్వాల్: అట్రాసిటీ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష రూ.11 వేల జరిమానా కోర్టు విధించింది. నేరెడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత నేరెడ్‌మెట్‌లో నివాసం ఉండే సన్యాసిరావు (52), స్థానికంగా నివసించే 42 ఏళ్ల మహిళను పరిచయం చేసుకుని శారీరక సంబంధం ఏర్పరచుకున్నాడు. అనంతరం మహిళను మోసం చేయడంతో పాటు కులం పేరుతో దూషించాడు. దీంతో బాధిత మహిళ 2020 సెప్టెంబర్ 29న నేరెడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ స్పెషల్ కోర్టు సోమవారం నిందితుడికి శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం


గోపిచంద్

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆంజనేయనగర్‌లో గోపీచంద్(22) అనే యువకుడు తన మామతో కలిసి ఉంటున్నాడు. కాగా 28న మధ్యాహ్నం ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వాకబుచేసినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పనులను పరిశీలిస్తున్న మాజీ మేయర్ అమర్‌సింగ్ తదితరులు

సీసీరోడ్డు పనుల పర్యవేక్షణ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ రాంనగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతికృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సీసీ రోడ్డు, యూజీడి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కాలనీల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. మాజీ మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, శారద, మాజీ కో–ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, రాందాస్‌గౌడ్, కవిత, కేవీగౌడ్, కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నాలాను ఆక్రమిస్తే కఠిన చర్యలు

బోడుప్పల్: రా చెరువు నాలాను ఆక్రమించుకుని నిర్మాణం చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ సోమవారం బోడుప్పల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. 33 అడుగులు ఉన్న నాలాను 12 అడుగుల్లో నాలా పనులు చేపట్టగా.. మరో 12 అడుగుల్లో రోడ్డు పనులు చేపట్టారన్నారు. పక్కనే ఉన్న అంబేడ్కర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి నాలాను 50 అడుగుల మేర నాలాను ఆక్రమించుకున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కింద నిధులు మంజూరు చేయించుకుని నాలాను కలుపుకొని ఇళ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. సదరు నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


గోకుల్‌నగర్‌లో డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

మౌలాలి : పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీత పిలుపునిచ్చారు. మౌలాలి డివిజన్ గోకుల్‌నగర్‌లో సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పారిశుద్ధ్య నిర్వహణ స్పెషల్ డ్రైవ్‌ను ఆమె ప్రారంభించారు. చెత్త, చెదారాలను రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ వాహన సిబ్బందికి అందించాలని సూచించారు. డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపరిచేందుకు అధికారులు, ప్రజల సమన్వయంతో కృషి చేస్తానని వివరించారు. అనంతరం గోకుల్‌నగర్‌లో పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ మధురిమ, శానిటేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, శివగౌడ్, మల్లారెడ్డి, బండమహేష్, వెంకటేష్ నేత, నటరాజ్, శ్రీనివాస్‌యాదవ్, కాశీనాథ్, లక్ష్మణ్‌గౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.